క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా 'బాండ్ల' ప్రక్రియ



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : టీడీఆర్ బాండ్ల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, నమోదు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో చేపట్టిన టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఆన్‌లైన్ చేసిన బాధితుల వివరాలు, దరఖాస్తుల స్టేటస్ తదితర అంశాలను తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ దరఖాస్తుల నమోదు ఆలస్యం అవుతోందని, ఆయా మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించిన అధికారులు పూర్తి వివరాలు స్వయంగా సేకరించాలని స్పష్టం చేశారు. ఈ నెల 20వ తేదీలోపు టీడీఆర్ బాండ్లు గిఫ్ట్ డీడ్ స్టేజ్‌కు రావాలని, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య పాల్గొన్నారు

పొట్టకొట్టొద్దని వినతి



మాట్లాడుతున్న చిరు వ్యాపారులు

తిరుపతి కల్చరల్ : తిరుమలలోని పాపవినాశంలో చిన్నపాటి పూసల దండలు అమ్ముకుంటూ జీవనం సాగించే తమ పొట్ట కొట్టవద్దని చిరు వ్యాపారులు, షికారీలు విన్నవించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. సుమారు 70 ఏళ్లుగా పాపవినాశనం ప్రాంతంలోనే వ్యాపారాలు చేసుకుంటున్నామని, అయితే అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనధికారికంగా వ్యాపారం చేస్తున్నామని తమ దుకాణాలను పడగొట్టి, సరుకులు సీజ్ చేశారన్నారు. ప్రశ్నిస్తే దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారని వాపోయారు. అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలపై మంత్రి పవన్ కల్యాణ్ స్పందించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బాలు, చిన్నతంబి, వెలియమ్మ, గోపి, వెంకటేష్, మంచాలమ్మ, వెల్లిరాజు, ధర్మ పాల్గొన్నారు.

పోరాటాలు తీవ్రం చేస్తాం



బీఎస్ బాబు, ఎన్‌ఎంయూ నేత

తిరుపతి అర్బన్ : కూటమి సర్కార్ ఆర్టీసీ ఉద్యోగుల కష్టాలను పట్టించుకోవడం లేదని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు ఆరోపించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తమ సమస్యలను ఇప్పటికే రాష్ట్రస్థాయి నేతలు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారని చెప్పారు. పరిష్కారం చూపలేదని ఆవేదన చెందారు. దీంతో ఈ నెల 2, 3 తేదీల్లో ఎర్ర బ్యాడ్జీలతో జిల్లాలోని 11 డిపోల్లో నిరసనలు తెలిపామన్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో ధర్నాలు చేశామని వెల్లడించారు.. ఈ నెల 17న అన్ని డిపోల్లో ప్లకార్డులతో ప్రదర్శనలు చేపట్టనున్నట్టు వివరించారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, అక్రమ సస్పెన్షన్లు నిలుపుదల చేయాలని కోరారు. ఉద్యోగోన్నతులు ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని సూచించారు. విద్యుత్ బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు.




స్విమ్స్‌లో ..



నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు



మాట్లాడుతున్న ఇన్‌కమ్‌టాక్స్ అదనపు కమిషనర్



నివాళులర్పిస్తున్న రంగస్థలి నేతలు

సేవలు చిరస్మరణీయం

మహాత్మ జ్యోతిరావుపూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఘనంగా నివాళులర్పించారు. బాలికా విద్య కోసం తపించిన పూలే సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. పూలే విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.

తిరుపతి కల్చరల్/ తిరుపతి తుడా/ తిరుపతి గాంధీరోడ్డు/ తిరుపతి లీగల్/ పాకాల



ఎస్వీ మెడికల్ కళాశాలలో..



సంస్కృత వర్సిటీలో..



ఎస్వీయూలో ..

అవినీతిలో.. ఇద్దరూ ఇద్దరే!



అవినీతిలో వారికి వారే సాటి.. తిరుపతి రూరల్ మండల రెవెన్యూ కార్యాలయంలో వారి మాటే వేదం.. చెప్పిందే శిలాశాసనం.. తహసీల్దార్ అయినా సరే.. జీ హుజూర్ అనాల్సిందే.. ఎవరికైనా పని పూర్తికావాలంటే వారి చేయి తడపాల్సిందే.. అడిగినంత ఇచ్చుకుని సలాం కొట్టాల్సిందే.. అధికారపార్టీ నేతల సేవలో నిత్యం తరించే ఆ ఇద్దరి జోలికి వెళ్లాలంటే ఉన్నతాధికారులు సైతం జడవాల్సిందే.. వారి వ్యవహారంలో వేలు పెడితే ఎవరి సీటు అయినా కదలాల్సిందే.. ఆ ఇద్దరు డీటీల బరితెగింపును తహసీల్దార్ సైతం కట్టడి చేయలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే అలుసుగా వారు ఇష్టారాజ్యంగా దందా సాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- పని పూర్తి కావాలంటే చేయి తడపాల్సిందే!
- ఎన్‌ఓసీల పేరిట రియల్టర్ల నుంచి రూ.లక్షల్లో వసూలు
- ఆక్రమణదారుల చేతుల్లోకి ప్రభుత్వ భూములు
- రెవెన్యూ కార్యాలయమే అడ్డాగా డీటీల దందా

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : చంద్రగిరి నియోజకవర్గం తిరుపతి రూరల్ మండలం రెవెన్యూ కార్యాలయంలోని ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్ల దందా తారస్థాయికి చేరింది. ప్రతి పనికీ ఓ రేటు ఫిక్స్ చేసుకుని యథేచ్ఛగా అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్‌ఓసీల పేరిట రియల్టర్లు, బిల్డర్ల నుంచి భారీగా ముడుపులు తీసుకుంటున్నారని సమాచారం. డీటీల అక్రమాలను తహసీల్దారు సైతం అడ్డుకోలేకపోతున్నారని తెలిసింది. నీకెంత..? నాకెంత..? అనే ధోరణితో సదరు లంచావతారులు చెలరేగిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఏం చెబితే అదే..!

రెవెన్యూ కార్యాలయంలో వారు ఎంత చెబితే అంత.. ఏది చెబితే అది జరిగి తీరాల్సిందే. తహసీల్దారు కూడా వారు చూపిన దారిలో వెళ్లాల్సిందే. దీన్నిబట్టి వారు ఏ స్థాయిలో హవా నడిపిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. మ్యుటేషన్లు, పట్టాదారు పాసు పుస్తకాల మంజూరు, నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పత్రాల్లో ఆ డీటీలు సంతకం చేస్తే చాలు.. ఎలాంటి పరిశీలన లేకుండానే తహసీల్దారు ఆమోదిస్తారు. ఫైల్‌ను ముందుకు కదలించేస్తారు. అలా కాదని పరిశీలన నిమిత్తం తహసీల్దారు ఒక్క రోజు ఫైలు ఆపినా చాలు.. ఆయన కుర్చీ కదలక తప్పదు.. ఎందుకంటే ఆ ఇద్దరు అంత పవర్ ఫుల్ అన్నమాట.

వారి మాటే శాసనం

తిరుపతి రూరల్ మండలంలో రూ.కోట్ల విలువైన భూములు వున్నాయి. అందులో ప్రభుత్వ, మఠం, ఇనాం భూములు, కాలువలు, కుంటలు, చెరువు భూములు కోకొల్లలుగా ఉన్నాయి. వీటన్నింటినీ సంరక్షిస్తూ ప్రజలకు అవసరమైన సేవలు అందించే తిరుపతి రూరల్ తహసీల్దారు కార్యాలయాన్ని ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లు శాసిస్తున్నట్టు సమాచారం. అక్కడకు ఏ తహసీల్దార్ వచ్చినా వారు చెప్పినట్లు వినాల్సిందే. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ద్విచక్ర వాహనాలపై మండలం మొత్తం తిరుగుతూ విలువైన ప్రభుత్వ భూములను గుర్తించడం వారికి నిత్యకృత్యం., అధికార పార్టీకి చెందిన వారిని అడ్డం పెట్టుకుని ఆక్రమణదారులకు అప్పగించేయడం వారి నైజమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. ఆ ఇద్దరు డీటీలు అనుకున్న పనులు గుట్టుచప్పుడు కాకుండా సజావుగా పూర్తి చేయడానికి కొందరు దళారులు, నమ్మకస్తులైన కొందరు వీఆర్‌ఓలను ఏర్పాటు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

కంచె చేను మేసినట్టు..

కంచె చేను మేసిందన్నట్టుగా ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులే రూ.కోట్లు విలువైన భూములను ఆక్రమణదారుల పరం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సామాన్య రైతులు సాగుచేసుకునే పంట పొలాల్లో కలసివున్న చుక్కల భూములు, అసైన్డ్ భూములకు సంబంధించి ఎన్‌ఓసీల కోసం కాళ్లు అరిగేలా తిరుగుతున్నా తమకు ఎన్‌ఓసీలు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1954కు ముందు రైతుల ఆధీనంలో వున్న దరఖాస్తు పట్టా భూములకు ఎన్‌ఓసీలు జారీ చేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోంది. దీన్ని తమకు అనుకూలంగా మార్చుకున్న ఆ ఇద్దరు డీటీలు దందాకు తెర లేపినట్టు సమాచారం. కార్యాలయ పని వేళలు ముగిసిన తర్వాత అర్ధరాత్రి వరకు పాగా వేసి తమ అక్రమాలకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్లు తోటి ఉద్యోగులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చేందుకు ఏరియాను బట్టి రేట్లు ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయాలన్నీ తహసీల్దారుకు తెలియదా..? అంటే అంతా తెలుసనే చెబుతారు.. కానీ ఆయన వారిని ఏమీ చేయలేని పరిస్థితి. ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెట్టడం తప్ప వారిపై అజమాయిషీ చేసే అధికారం లేదని సమాచారం. సదరు డీటీలకు అధికార పార్టీకి చెందిన నేతల అండ మెండుగా ఉండడమే ఇందుకు కారణంగా చెబుతుండడం గమనార్హం.

నోటీస్ బోర్డు

- తిరుపతికి రానున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు.
- శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఉదయం 8 గంటలకు స్నపన తిరుమంజనం, రాత్రి 7 నుంచి తెప్పోత్సవం.
- కచ్చపి ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ఒకే దేశం–ఒకే ఎన్నిక అనే అంశంపై సదస్సు.
- వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉదయం 10 గంటలకు అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ నిరసన.
- మూడు సెషన్లుగా ఏపీపీఎస్సీ పరీక్షలు.
- జాతీయ సంస్కృత వర్సిటీలో సాయంత్రం 6 గంటలకు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సంస్మరణ సభ.
- వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఎమ్మార్‌పల్లె సర్కిల్ నుంచి సాయంత్రం 4 గంటలకు స్కూటర్ ర్యాలీ.
- ఉదయం 11 గంటలకు ఇంటర్ పరీక్ష ఫలితాలు విడుదల.

మహిళా వర్సిటీలో సెమినార్ పోటీ

తిరుపతి సిటీ : అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని పద్మావతి మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో ×మహిళా సాధికారతలో అంబేడ్కర్ సాహసిక పాత్ర అనే అంశంపై శుక్రవారం సెమినార్ పోటీ నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు.ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ అధికారి జ్యోత్స్న కల్పన పాల్గొన్నారు.

అన్నమాచార్యలో 'సింపోజియం'



సదస్సులో అధ్యాపకులు, అతిథులు

తిరుపతి సిటీ : కరకంబాడి రోడ్డులోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ విభాగం ఆధ్వర్యంలో ఆవేజ్–25పేరుతో రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ నాధముని రెడ్డి, విభాగాధిపతి కె.బాలాజీ, నందకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

13న వివాహ పరిచయ వేదిక

తిరుపతి కల్చరల్ : రాయల బలిజ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన గాంధీరోడ్డులోని ఏజీకే బిల్డింగ్ ఆవరణలో పద్మావతి వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు పి.సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. వివరాలకు 8712233082, 9912761533 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నూతన భవనంలోకి దోబీ సెక్షన్



దోబీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న రవిప్రభు

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రి ఐడీహెచ్ ప్రాంతంలోని దోబీ సెంటర్‌ను ఇటీవల నూతనంగా నిర్మించిన భవనంలోకి మార్చినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నూతన భవనంలో దోబీ సెక్షన్‌ను ఆయన ప్రారంభించారు. కొత్త భవనంలో యంత్రాల కోసం రూ. 4లక్షలు వెచ్చించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ శ్రీనివాసులు, అసిస్టెంట్ ఆర్ఎంఓ డాక్టర్ హరికృష్ణ, నర్సింగ్ గ్రేడ్–2 లలితకుమారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఎస్వీయూలో ముగిసిన సదస్సు



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతి సిటీ : ఎస్వీయూలో సాంప్రదాయ ఔషధం :: ఆధునిక, సహజ చికిత్సల ఏకీకృత విధానం అనే అంశంపై మూడురోజులుగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారంతో ముగిసింది. రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ పారంపర్య, ఆయుర్వేద వైద్యం భవిష్యత్తు తరాలకు అందించాల్సి అవసరముందన్నారు. ఇండియన్ హెరిటేజీకు ఆయుర్వేదం, పారంపర్య వైద్యం అత్యవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ ఆచార్య కామాక్షి, ఎస్వీయూ బయో కెమిస్ట్రీ పూర్వ విద్యార్థి డాక్టర్ కామేశ్వరరావు బద్రి, అధ్యాపకులు నాగలక్ష్మి, దేవమ్మ, విజయ, వేణు, అంకన్న పాల్గొన్నారు.

ఐఐటీలో 5-కె ఫిట్‌నెస్ రన్ రేపు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 6గంటలకు 5–కె ఫిట్‌నెస్ రన్ నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్ సత్యనారాయణ తెలిపారు. ఆరోగ్యం, ఫిట్‌నెస్ పెంపొందించే లక్ష్యంతో 500మందితో 5కె రన్ ప్రారంభమవుతుందని, రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. యువతీ యువకులు, మహిళలు, పురుషులు పాల్గొనవచ్చన్నారు. ఈ రన్‌లో తొలి ఐదు స్థానాల్లో నిలిచిన వారికి వరుసగా రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ. 2వేలు, రూ.వెయ్యి చొప్పున నగదు బహుమతులిస్తామన్నారు. అలాగే టాప్ టెన్‌లో నిలిచిన వారికి పతకాలను, అలాగే రన్‌లో పాల్గొన్నవారికి టీ షర్ట్, పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇస్తామన్నారు. వివరాలకు టి.శ్రీధర్ రెడ్డి(8688795343)ని సంప్రదించాలని కోరారు.

బోర్ల కేబుల్ చోరీ

పాకాల : దామలచెరువు పంచాయతీ గొల్లపల్లె వద్ద ఐదుగురు రైతులకు చెందిన బోర్లకు కేబుల్ వైర్లను గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. శుక్రవారం ఈ మేరకు బాధితులు మాట్లాడుతూ పోలీసులు కట్టుదిట్టంగా నిఘా పెట్టి చోరీలను అరికట్టాలని కోరారు.

పౌష్టికాహారంపై అవగాహన

పాకాల : మండలంలోని రమణయ్యగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టిహారంపై అవగాహన కల్పించారు. శుక్రవారం పోషణ్ పఖ్వాడలో భాగంగా సూపర్‌వైజర్ కృష్ణవేణి మాట్లాడుతూ రక్తహీనతను అధిగమించేందుకు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు జి.సులోచన, చంద్రగిరి రేవతి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



గోడను తొలగించిన అధికారులు

తిరుపతి రూరల్ : మండలంలోని దామినేడులో సర్వే నంబరు 41/2లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించిన నిర్మించిన ప్రహరీ గోడను అధికారులు శుక్రవారం రాత్రి తొలగించారు. తహసీల్దార్ రామాంజులు నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వడ్డీ మినహాయింపు..గడువు పెంపు

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ పరిధిలో ఇంటిపన్నులు, ఖాళీ జాగా పన్నులను చెల్లిస్తే 50 శాతం వడ్డీ మినహాయింపు అవకాశాన్ని ఈ నెలాఖరు వరకు పొడిగించినట్లు కమిషనర్ మౌర్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024– 2025 సంవత్సరం పన్ను బకాయిలను ఈ నెల 30 వ తేదీ లోపు ఒకేసారి చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ ఇస్తున్నామని వివరించారు. సెలవు రోజుల్లో కూడా నగరపాలక సంస్థలో పన్ను చెల్లింపు కౌంటర్లు పని చేస్తాయని వెల్లడించారు.

తిరుచ్చిపై సిరులతల్లి విహారం

తిరుపతి రూరల్ : తిరుచానూరు పద్మావతీదేవి శుక్రవారం బంగారు తిరుచ్చిపై విహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

తిరుపతి క్రైమ్: నగరంలోని జీవకోన రాజునగర్ కాలనీలో ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. అలిపిరి పోలీసుల కథనం మేరకు సిరివెళ్ల శాంతమ్మ(65)తన నివాసంలో అనుమానాస్పదంగా మృతి చెందింది. తన తల్లి ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ఆమె వద్ద బంగారు నగలు ఉన్నాయని కుమారుడు అమరనాథ్ పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ఘనంగా కస్తూర్బా జయంతి



కస్తూర్బా గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : గాంధీ రోడ్డులోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ కార్యాలయం వద్ద చైర్మన్ డాక్టర్ పీసీ.రాయులు ఆధ్వర్యంలో శుక్రవారం కస్తూర్బా గాంధీ 156వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు అన్న, వస్త్రదానం చేశారు. డిప్యూటీ మేయర్ మునికృష్ణ, టీడీపీ నేత మబ్బు సూర్యనారాయణరెడ్డి ,బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు బండి మధుసూదన్‌రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, ఉమాపతి పాల్గొన్నారు.

ఘర్షణ..పలువురికి గాయాలు

తిరుపతి రూరల్: మండలంలోని దుర్గసముద్రం వడ్డిపల్లి, దళితవాడ వాసులు గురువారం అర్ధరాత్రి ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో పలువురుకి గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. వడ్డిపల్లి వినాయకస్వామి ఆలయం వద్ద దళితవాడకు చెందిన ఇంద్ర, నాగేష్ సిగరెట్ తాగుతుండగా వడ్డపల్లికి చెందిన దర్నేష్ గుడి వద్ద సిగరెట్ తాగొద్దని హెచ్చరించాడు. దీంతో వారిద్దరి మధ్య గొడవ చోటు చేసుకుంది. ఆ గొడవ కాస్త పెద్దదై రెండు గ్రామాల ప్రజలు కొట్టుకునే స్థాయికి చేరింది. ఈ ఘర్షణలో రెండు గ్రామాలకు చెందిన పలువురు గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు తన సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని ఘర్షణకు పాల్పడుతున్న వారిని చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం రాత్రంతా పికెట్ ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం రెండు గ్రామాలకు చెందిన వారు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని రాజీకి సిద్ధపడడంతో గ్రామాల మధ్య వైషమ్యాలు పెంచకుండా బైండోవర్ కేసులు పెట్టిన పోలీసులు మరోసారి ఇలాంటి గొడవలకు పాల్పడితే నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి జైలుకు పంపుతామని హెచ్చరించారు.